

# తీపిగుర్తు

ఝుజ్ఝావా ఉత్తిణ్ణే అధరవివర పలోట్ట సలిల
ధారాహి!
కుడ్డలిహి ఓహిది అహం రఖ్ఖ ఇ అజ్జా కర
అలేహి!!(గాథా సప్తశతి)

హోరుగాలి, ధారాపాతమైన వర్షం. మామూలుగా మంద్రగంభీరంగా పారే గోదావరి ఈ రాత్రి ఒడ్లొరుసుకుంటూ దురుసుగా మహావేగంగా పారుతూంది. గట్టు మీద వర్షంలో తడుస్తూన్న చెట్లన్నీ గాలికి తాండవం చేస్తున్నాయి. మెరుపుల కళ్ళతో ఈ చీకట్లో "మేమూ వున్నాం చూడండి" అంటూ పదేపదే మేఘాలురుముతున్నాయి. నింగీ-నేలా ఏకమై ఒకే వర్ణాన్ని నిరూపిస్తున్నాయి.

గోదావరిగట్టుపై చెట్లమధ్యన వున్న గుడిసెలన్నీ వర్షంలో తడిసీ-గాలికి ఊగీ వదవదా వణకుతూ టపటపా శబ్దాలు చేస్తున్నాయి.

ఆ చలికీ-గాలికీ తట్టుకోలేకో అన్నట్టుగా అన్ని గుడిసెల మధ్యలో ముడుక్కుంది ఓ గుడిసె. ఆ గుడిసెలో ఒక ముగుద. ముగుద మనసులో ఏవో ఆలోచనలు.

చదువురాని అమాయకత్వం కట్టూబొట్టూలో కలబోసుకున్నా అందం మాత్రం శరీరమంతా విరబోసుకుంది.

ఆ గుడిసెకు మట్టిగోడలు. మట్టిగోడలకు కళ్ళవంటి కిటికీలు. కిటికీ సందుల్లో దూసుకుని అప్పుడప్పుడూ దూరిపడే చినుకులు.

రెపరెపలాడే పైటతో వడగాలి ఎగతాళి చేస్తున్న ట్లుంది. రాలే ఒక్కొక్క చినుకూ ఒక్కొక్క ములుని బాకు.

చినుకు చినుకూ కలిసి ధారగా మారి, ధారధారా కలిసి ధాటిగా చేరి, గుడిసెపై వాలిన చెట్లపై, చెట్ల ఆకుల నుండి గుడిసెపై, గుడిసెపూరి నుండి లోపలి వెదుళ్ళపై, వెదుళ్ళ పగుళ్ళ నుండి గోడలపై— యిలా చెమ్మది చెమ్మదిగా జారి గోడలను తడిపేస్తున్నాయి.

ఆమె అలా తిరిగి చూసింది.

"అమ్మో! గోడ తడిసిపోతూంది."

గోడపై నీటి ధారలు చారలుగా కారుతున్నాయి. తానొక మహా ప్రవాహంలో కొట్టుకుపోతున్నట్లనిపించిందామెకు. తానెంత తడిసినా పరవాలేదుగానీ, గోడ తడిస్తే... ఇంకేమైనా వుందా?

అప్పుడే—ఒకటీ—రెండూ—మూడూ కాదు—నాలుగు—గోడమీది సున్నపుగీతలు తడిసిపోయాయి. తడిసి చెదిరిపోయాయి.

ఆమె గబగబావెళ్ళి ఆ సున్నపు గీతలు తడవకుండా చేతులడ్డం పెట్టింది.

దాదాపు వెలరోజుల క్రిందట తనమావ పొరుగూరుకెళ్ళాడు. అప్పుడు గీచిన గీతలివి. మరోలా లెక్కించుకోడానికి చదువూ-సందే రాకపోయె. అందుకే యిలా సున్నంతో గీతలు గీచుకుంది.

రోజుకొక్క గీత చెరిపేస్తూ వస్తూంది. ఇంక కొన్ని గీతలు మాత్రమే వున్నాయి.

గోడపై ఒక్కొక్క గీత తగ్గేకొద్దీ మనస్సులో-దేహంలో ఒక్కోలా కోర్కె పూత పూస్తుంది—తొందరగా మావ వస్తాడని.

ఇప్పుడీ పాడువర్షంగుర్తులు చెరిపేస్తే-అంతా అయోమయం. మావ ఎప్పుడొస్తాడో తెలీదు. గడువెన్నాళ్ళుందో తెలీదు. అందుకే అంత తొందరగా వెళ్ళి గుర్తులు తడవకుండా చేతులడ్డం పెట్టింది.

ఇంతలో—

వెనకాల వెచ్చని స్పర్శ— "ఎవరూ?
నువ్వా? మావా!"

"ఔను! నేనే! పొయ్న పనైంది. వేగిరమొచ్చా!"

ఆనందం చిందులేసింది. అందం విందు చేసింది. అంగాంగం బంధాలేసింది. బయట వానజోరు తగ్గింది. మనస్సులో కోర్కెలహోరు పెరిగింది.

కాకలు రేగే శరీరాలతోనే
చలిమంటలు కాచుకున్నారు.

—మాడుగుల నాగఫణిశర్మ

# కాలమ్ దాటని కథ

చాలా పాత కాలంలో, ఒక అత్త, తన కోడలికి ఉపదేశం చేస్తూ "అమ్మా! నేను మనవాళ్ళ ఇంటికి వెడుతున్నాను. సంధ్య వేళ వాకిట్లో నాలుగు క్రలలు వేయి! ముక్కు నలుపు - దీపంపెట్టు! నీకు చిన్నతనం! పెద్ద అంతరం, చిన్నఅంతరం తెలియడంలేదు. ఆకుమాటు పిందెల్లే ఉండాలమ్మా!" అని చెప్పి, పెత్తనానికి వెళ్లిపోయింది. పెత్తనం అంటే, పెద్ద తనంలో పొరుగిళ్లకు వెళ్లి మంచి చెడ్డలు మాట్లాడుకోవడం. "అల్లాగే అత్తయ్యా!" అని, కోడలు వినయంతో ఆచరించాలని ప్రయత్నించింది.

వాకిట్లో నాలుగు కట్టెపుల్లలు పడవేసింది. ముక్కు నలుపుకుంది. ఆముదపు దీపంలో వత్తిని వెలిగించాలని ప్రయత్నిస్తే అది వెలగలేదు. బాదమాకులు వంటినిండా కప్పకొని వంటింట్లో ఒక మూల పడుకుంది. అత్తగారు వచ్చేసరికి అమంగళంగా వాకిట్లో కట్టెపుల్లలున్నవి. వాటిని తీసివేసి లోపలికి వెళ్లి చూస్తే ఇంట్లో దీపంలేదు. కోడలు కనబడ

## లోకజ్ఞానం

లేదు. కేక పెడితే బాదమాకులలోనుంచి లేచి వచ్చింది. "ఇదంతా ఏమిటే?" అని అత్త అంటే, "నువ్వు చెప్పినట్లే చేశానత్తయ్యా!" అంది. అప్పుడు అత్తగారికి యాదికి వచ్చింది.

"ఓసి పిచ్చిదానా! ఎల్లా బ్రదుకుతావే! క్రలలంటే ముగ్గు క్రలలని తెలియక పోయె! ముక్కు నలపమంటే వత్తి ముక్కు నలపకుండా, నీ ముక్కు నలుపుకొని ఉంటావు. కనుక దీపం వెలగలేదు. ఆకు చాటున పిందె అంటే, అణిగిమణిగి ఉండడం కాని ఆకులు కప్పకోవడం కాదే!" అంది.

"అల్లాగా అత్తయ్యా!" అని కోడలు తెల్లబోయింది.

"రోజూ నేను ముగ్గువేయడం, వత్తి వెలిగించడం చూడడంలేదటే! ఇంత లోకజ్ఞానం లేకపోతే ఎల్లాగే!" అని, ఒక చిట్టి మొట్టికాయ వేసింది అత్తగారు.

—పైడిపాటి సుబ్బరామశాస్త్రి